క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా ఆదివారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఘనాపూర్, ఘనాపూర్ తండా పరిధిలోని అన్ని ఫీడర్లకు, పరిశ్రమలకు, అగ్రికల్చర్, డోమస్టిక్, పారిశ్రామిక సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

అందుబాటులో బుకింగ్స్ వెబ్‌సైట్

కీసర: కీసరగుట్ట బ్రహోత్సవాల సందర్భంగా ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం వీఐపీ దర్శనం, అభిషేకం, కల్యాణం కోసం ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా బుకింగ్ చేసుకునేందుకు ఆదివారం ఉదయం నుంచి httpe:// keesaragutta.telangana.gov.inవైబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 9701427444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జవహర్‌నగర్ సీఐగా సీతారాం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సీతారాం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఈయన జవహర్‌నగర్‌కు బదిలీపై వస్తుండగా ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్ కౌంటర్ ఇంటలిజెన్స్‌కు బదిలీ అయ్యారు.

'సమస్యలను గాలికొదిలేసి కామెడీ చేయడం సిగ్గుచేటు'

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు తాండవం చేస్తూ పరిష్కారాలకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన మంత్రి మల్లారెడ్డి ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం కామెడీలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నాడు. ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌లో పేద విద్యార్థుల కోసం ఏళ్లుగా డిగ్రీ కళాశాల అంశం పెండింగ్‌లో ఉందని, అలాంటి సమస్యలపై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా మంత్రి సమస్యలపై మాట్లాడి ప్రభుత్వం నుంచి మేడ్చల్‌కు రావాల్సినవి రప్పించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కీసర: బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంపీపీ మంగతాయారు, కీసర సర్పంచ్ మాధురిలు అన్నారు. శనివారం కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతర జరిగే ప్రాంతంలో ట్రాక్టర్లతో చేపట్టిన క్లీనింగ్ పనులు, మరుగుదొడ్ల వద్ద మరమ్మతులు, ఆర్టీసీ ప్రాంగణ ప్రాంతంలో చెత్తాచెదారం తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు 'శ్రీనిధి' సాంకేతిక పరికరం



సిస్టమ్‌ను పరీక్షించిన అటవీ శాఖ అధికారులు

పోచారం: అడవుల సంరక్షణకు పోచారం మున్సిపాలిటీ యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల పరిశోధనా విభాగం ఓ సరికొత్త సాంకేతిక వ్యవస్థను ఫారెస్ట్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో రూపొందించింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరిజ్ఞానంతో అడవుల పర్యవేక్షణ వ్యవస్థకు రూపకల్పన చేశారు. ఈ పరికరంతో అడవుల్లో అక్రమంగా చెట్లను నరికి వేయడం, అగ్ని ప్రమాదాలు, ప్రాణుల గురించి తెలుసుకునే వీలుంటుంది. కళాశాలోని ఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ వి.జయప్రకాషన్, డాక్టర్ పి.లావణ్య సారథ్యంలో ఈ వ్యవస్థ ఆవిష్కృతమైంది. ఈ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర సాంకేతిక మండలి నిధులు సమకూర్చింది. వ్యవస్థ పనితీరును ములుగు జిల్లాలోని ఏటూరినాగారం వన్య ప్రాణి అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు కిష్టాగౌడ్, ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ సమక్షంలో విజయవంతంగా పరీక్షించారు. లేజర్ కిరణాలు, వివిధ రకాల సెన్సార్లను వినియోగించి ఏర్పాటు చేసిన పర్యవేక్షణ వ్యవస్థ అడవుల్లో జరిగే ప్రమాదాలు, చెట్లు నరికి వేయడం, వన్య ప్రాణుల సమాచారం సేకరించి క్లౌడ్ సర్వర్ ద్వారా అప్లికేషన్ డాష్‌బోర్డుకు చేరవేస్తోంది.

శివసాయి ఎన్‌క్లేవ్‌లో చోరీ

రూ.3 లక్షల నగదు, 2 కిలోల వెండి, 2 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

కీసర: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.5 లక్షల విలువ చేసే నగలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... నాగారం మున్సిపాలిటీ శివసాయి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ ఈ నెల 9న సూర్యాపేటలో తమ బంధువుల పెళ్లికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చిన పని మనిషి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం చూసి ఇరుగుపొరుగు వారి సాయంతో కుటుంబ యజమానికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఇంటికి చేరుకున్న శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.3 లక్షల నగదు, 2 కిలోల వెండి, 2 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్వాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లో ఆధారాలు సేకరించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా యూఎస్‌లో చదువుకుంటున్న తన కుమారుడికి ఫీజు చెల్లించేందుకు దాచిన రూ.3 లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో బాధితుడు శ్రీనివాస్ బోరున విలపించాడు.

కీసరగుట్ట అభివృద్ధిపై

శీత కన్ను!

ఐదేళ్ల కిందట రూ.75.65 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు

- నేటికీ పట్టించుకోని ప్రభుత్వం
- ఈ సారి ఉత్సవాల వరకు నిధుల మంజూరుపై భక్తుల్లో ఆశలు
- ప్రతీ ఏటా భక్తుల నుంచి వస్తున్న ఆదాయం రూ.3 కోట్లు
- నిధులు మంజూరుపై మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని జిల్లా ప్రజల వినతి

తెలంగాణలో రెండో వేములవాడ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న సుప్రసిద్ధ కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం శీత కన్ను ప్రదర్శిస్తోంది. ఐదేళ్ల కిందట ఆలయ అభివృద్ధికి రూ.75.65 కోట్లతో ప్రభుత్వానికి నివేదించిన ప్రతిపాదనలకు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరిగే కీసరగుట్ట బ్రహ్మోత్సవాల వరకైనా మోక్షం లభించగలదన్న ఆశాభావాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలు, ముఖ్యంగా భక్తులు వ్యక్తం చేస్తున్నారు. కీసర గుట్టకు ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

– సాక్షి,మేడ్చల్ జిల్లా



కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం

ప్రతీ ఏటా పెరుగుతున్న భక్త జనం..

హైదరాబాద్‌కు సమీపంలో ఎత్తయినా సువిశాలమైన ప్రదేశంలో వెలిసిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి శైవక్షేత్రానికి ప్రతీ ఏటా భక్త జనం తాకిడి బాగా పెరుగుతూ వస్తోంది. గతేడాది 3 లక్షల మంది భక్తులు రాగా, ఈ ఏడాది 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం ఆ మేరకు అన్ని సదుపాయాలతో ఏర్పాట్లు చేస్తోంది. మేడ్చల్ జిల్లా నుంచే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సిద్దిపేట, యాదాద్రి, నల్లగొండ, వరంగల్ ఇతర జిల్లాల నుంచి ఈ శైవక్షేత్రానికి ప్రతీ ఏటా మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి ఉత్సవాలను లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు.



ఆలయంలో కొలువుదీరిన శ్రీరామలింగేశ్వర స్వామి

ఏటా భక్తుల నుంచి వచ్చే ఆదాయం రూ.3 కోట్లు...

కీసరగుట్ట శైవక్షేత్రానికి ప్రతీ ఏటా మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి ఉత్సవాలతో సాధారణంగా తరలి వచ్చే లక్షలాది మంది భక్తుల ద్వారా ఆలయానికి దాదాపు రూ.3 కోట్ల ఆదాయం వస్తోందని దేవాదాయ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. శివరాత్రి సందర్భంగా ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు దేవాదాయ శాఖ తెలిపింది. గతేడాది కీసర గుట్ట దేవస్థానం మహాశివ రాత్రి ఉత్సవాలకు రూ.70 లక్షలు వెచ్చించినట్లు ఆ శాఖ పేర్కొంది.

ఆలయాభివృద్ధికి ఐదేళ్ల కిందటే ప్రతిపాదనలు...

కీసరగుట్ట ఆలయాభివృద్ధికి 2017 డిసెంబర్‌లో రూ.75.65 కోట్లతో జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. హైదరాబాద్ మహా నగరానికి కీసరగుట్ట కూత వేటు దూరంలో ఉండటంతో నగరం నుంచి ప్రతిరోజు వేలాదిగా భక్తులు తరలి రావడంతో.. అందుకు తగ్గట్టుగా భక్తులకు వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం అధికార యంత్రాంగానికి ఉంది. అప్పట్లో ఆలయాన్ని సందర్శించిన సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యదర్శి భూపతిరెడ్డికి అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి సంబంధిత ప్రతిపాదనలను అందజేయడంతో పాటు సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అభివృద్ధి ప్రతిపాదనలివే...

- రామలింగేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి ప్రతిపాదించిన రూ.75.65 కోట్లతో ఈ కింది పనులు చేపడితే.. రెండో వేములవాడ శైవక్షేత్రంగా అభివృద్ధి చెందగలదని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.
- ఆలయానికి ప్రస్తుతం రెండు వైపుల మాత్రమే రాజ గోపురాలు ఉన్నాయి. మిగతా రెండు వైపుల కూడా రాజ గోపురాల నిర్మాణం చేపట్టాలి.
- కీసర గుట్ట ఎక్స్ రోడ్డు నుంచి ఆలయం వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
- ఆంజనేయ స్వామి ఆలయం నుంచి నూర్ మహ్మద్ చెరువు వరకు రోప్ వే నిర్మించాల్సి ఉంది.
- కోనేరు నిర్మాణం, ధర్మశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, బైపాస్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి.
- 100 ఎకరాల అటవీ భూమిలో అర్బన్ పార్కు ఏర్పాటు చేసి భక్తులకు ఆహ్లాదంగా ఉండేట్లు మంచి వాతావరణం కోసం వసతులు కల్పించాల్సి ఉంది.
- మిషన్ భగీరథ కింద దైవ క్షేత్రానికి వచ్చే భక్తులకు సరిపడా నీటి వసతి కల్పించాలి.
- కీసర, చీర్యాల, దొంగల మైసమ్మ చౌరస్తాల వద్ద ముఖ ద్వారాలు, ప్రాకార మండపాలు నిర్మించాలి.
- అన్నదాన ప్రసాదం, లడ్డూ ఇతర ప్రసాద కౌంటర్ల నిర్మాణం, పరిపాలనా భవనం, సమావేశ మందిరం, చైర్మన్ ట్రస్టీ కార్యాలయం నిర్మించాలి.
- గుట్టపై గల లక్ష్మీనర్సింహ స్వామి, ఆంజనేయ స్వామి, మారుతీ కాశీవిశ్వేర ఆలయం, నాగదేవత ఆలయాలను అభివృద్ధి చేయాలి.
- నూర్‌మహ్మద్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలి.
- స్పోర్ట్స్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ నిర్మాణం, ఓపెన్ థియేటర్, పారిశుధ్య కార్మికులకు షెడ్, భోజనశాల, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, క్యూలైన్ల షెడ్ నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, దేవాయ అతిథి గృహాలు, వీఐపీలు, వీవీఐపీల గదుల నిర్మాణం, జేడీ్ప అతిథి గృహం అభివృద్ధి, సౌండ్ సిస్టమ్, విద్యుత్ స్తంభాలు, రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు, ఆర్కియాలజీ మ్యూజియం అభివృద్ధి తదితర సుందరీకరణ పనులు చేపట్టాలి.



నిర్వహణకు సర్కారు నిధులు..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కీసరగుట్టలో 2020లో రూ.25 లక్షలు, 2021లో రూ.50 లక్షలు, 2022లో రూ.50లక్షల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఉత్సవాలకు ప్రభుత్వం తాత్కాలికంగా విడుదల చేస్తున్న నిధులతో సహా ఆలయ కమిటీ ప్రత్యేకంగా వెచ్చిస్తున్న ఖర్చులు, భక్తులకు కల్పించే వసతులు, ఆదాయ, వ్యయాలకు సంబంధించి పలు అనుమానాలకు తావిస్తోంది.

'బ్రహ్మోత్సవాలకు రూ.కోటి మంజూరు సంతోషకరం'

సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కీసరగుట్ట ఆలయ చైర్మన్

కీసర: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణకు గాను మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక చొరవతో సీఎం కేసీఆర్ రూ.కోటి మంజూరు చేయడం సంతోషించదగ్గ విషయమని కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ అన్నారు. ఈ మేరకు శనివారం మంత్రి మల్లారెడ్డిని రమేష్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాల మొదటిరోజు పూజల్లో పాల్గొనాలని మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, సర్పంచ్ నాయకపు మాధురి, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు తటాకం నారాయణ, తటాకం రజినీకాంత్, టెంపుల్ రినోవేషన్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



నర్సింహా రెడ్డి కళాశాలలో హ్యాకథాన్



ప్రసంగిస్తున్న కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, హ్యాకథాన్‌లో తమ ప్రయోగంతో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి కళాశాలలో జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఐఏఆర్ఈ ప్రొఫెసర్ గోవర్ధన్, కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో మనుగడ సాధించాలంటే విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. హ్యాకథాన్‌లో భాగంగా కోడింగ్, గేమింగ్ యాప్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీలపై పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి

జవహర్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హింసాత్మకమైన వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు శనివారం ఆయన పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానంద్, అనంతలక్ష్మి, రజిత, లక్ష్మి, విజయ, కన్నయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో...

మేడ్చల్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ అలియాస్ నాగులపు ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ డిమాండ్ చేశాడు. ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మేడ్చల్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య, సుధాకర్, శంకర్, ప్రేమలత, పాల్గొన్నారు.



బహుజన సంఘాల ఆధ్వర్యంలో...

ఘట్‌కేసర్: అంబేడ్కర్ రాసిన రిడిల్స్ ఇన్ హిందూ ఇజం అనే పుస్తకాన్ని దూషించిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బహుజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో దాసు, శ్రీశైలం, అరుణ్‌కమార్, నరసింహ, బాలయ్య, రాందాసు, సాయిలు, నారాయణ, బాబురావు, శివకుమార్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

భూ వివాదంలో కౌన్సిలర్‌పై కేసు



కౌన్సిలర్ తుడుం గణేశ్

మేడ్చల్‌రూరల్: అధికారం అడ్డుగా పెట్టుకుని అమాయకుల భూమిలోకి వెళ్లి ఈ స్థలం నాదంటూ బెదిరింపులకు పాల్పడి ఆ స్థలంలోని ప్రహరీని కూల్చివేసిన అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన మేడ్చల్ మున్సిపల్‌లోని 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేశ్‌పై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ కిష్టాపూర్ గ్రామంలో సలేహా బేగం–అక్బర్ కుటుంబానికి తాతల కాలం నుంచి 2500 గజాల స్థలం ఉంది. కొంత కాలం క్రితం కొంత స్థలాన్ని ఇతరులకు విక్రయించగా ప్రస్తుతం సలేహా బేగంకు కుటుంబీకుల 602 గజాల స్థలం ఉంది. కొన్నేళ్ల క్రితం సలేహా బేగం కుటుంబం మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. తమ స్థలం ఎక్కడికి వెళ్లదులే అనుకున్న వారు ఇటీవల ఆ స్థలాన్ని చదును చేసేందుకు సలేహా బేగం భర్త అక్బర్ వెళ్లగా అధికార పార్టీకి చెందిన స్థానిక కౌన్సిలర్ తుడుం గణేశ్ అక్కడికి చేరుకుని ఈ స్థలం తమదంటూ వారిపై బెదిరింపులకు పాల్పడ్డాడు. పలుమార్లు గ్రామస్తులంతా ఏకమై సమస్య పరిష్కరించేందుకు చూడగా కౌన్సిలర్ గ్రామస్తుల సమక్షంలోకి వచ్చేందుకు మొహం చాటేశాడు. దీంతో గ్రామ పెద్దలు ఈ స్థలం ఏళ్లనాటి నుంచి సలేహా బేగం వారిదే అని తేల్చారు. అనంతరం ఆమె కుటుంబీకులు ఆ స్థలంలో ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రాత్రికిరాత్రే కౌన్సిలర్ గణేశ్ ఆ స్థలంలోకి వెళ్లి ప్రహరీని కూల్చివేశాడు. దీంతో బాధితులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. కౌన్సిలర్ గణేశ్ కూల్చివేతల సమయంలో గతంలో సలేహా బేగం నుంచి స్థలం కొనుగోలు చేసిన వారి స్థలంలో సైతం కూల్చివేతలకు పాల్పడటంతో డబిల్‌పూర్‌కు చెందిన కొమ్ము ప్రభాకర్ సైతం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఈ మేరకు ఈ నెల 9న కౌన్సిలర్ తుడుం గణేశ్‌పై ఐపీసీ 447, 427, 506 సెక్షన్లు నమోదు చేశారు. కాగా కౌన్సిలర్‌పై తాము ఫిర్యాదు చేసి మూడు రోజులు అవుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శనివారం మరోమారు బాధితులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించగా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

'మల్లారెడ్డి' కళాశాల విద్యార్థినుల క్షేత్ర పర్యటన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు శనివారం క్షేత్ర పర్యటన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత ఆధ్వర్యంలో బహదూర్‌పల్లిలోని ఇందిరమ్మ కాలనీలో పర్యటించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు గ్రామ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలు వారి దృష్టికి రావడంతో ఆ ప్రాంత అధికారులకు నివేదించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో వివరాలు సేకరిస్తున్న విద్యార్థినులు

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్, శ్రీనివాస్

ఘట్‌కేసర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13న నిర్వహించ తలపెట్టిన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం కరపత్రాన్ని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వర్గీకరణకు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేశ్, స్వామి, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, శివకుమార్, నరేందర్, సాయిలు, రవి, మహేశ్, భాను, నరసింహ పాల్గొన్నారు.

సన్మానం



మేడ్చల్: బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ నాయకురాలు అనిమసోంకర్‌ను మున్సిపాలిటీ ఎస్సీ మోర్చా నాయకులు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా దళిత నాయకులు చురుకుగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకుడు జాకట ప్రేందాస్, రవికుమార్, సోషల్ మీడియా విభాగం నేతలు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

ఘట్‌కేసర్: అవుషాపూర్, ఘట్‌కేసర్‌లో జాతీయ రహదారిని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి జాతీయ రహదారుల పీడీ పంకజ్ పరిశీలించారు. ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఈ మేరకు ఎంపీ లక్ష్మణ్, కేంద్ర మంత్రి గడ్కరీకి వినతి అందజేసిన నేపథ్యంలో జాతీయ రహదారుల అధికారులు స్పందించారు. ఘట్‌కేసర్ జంక్షన్, అండర్ పాస్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, అవుషాపూర్ సర్వీస్ రోడ్డులో వర్షం నీరు వెళ్లేందుకు వ్యవస్థను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ అనూష, జీఎం తేజోనిధి మూర్తి, కౌన్సిలర్ పద్మారావు, సర్పంచ్ కావేరి, మైపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాధాకృష్ణ ముదిరాజ్, మల్లేశ్ ఉన్నారు.

'కుమారుడి పెళ్లిలోనే తండ్రిని అరెస్ట్ చేయడం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న కుతాడి కుమార్

– తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం

జవహర్‌నగర్: అక్రమంగా అరెస్ట్ చేసిన కుతాడి శ్రీనివాస్‌కు జైలులో ఏం జరిగినా మేడ్చల్ డీసీపీదే బాధ్యత అని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ హెచ్చరించారు. పారిశ్రామిక వేత్త కుతాడి శ్రీనివాస్ తన రెండో కుమారుడి పెళ్లి వేడుకలోనే పోలీసులు సినీ ఫక్కీలో అరెస్ట్ చేయడం మేడ్చల్ జిల్లాలో కలకలం లేపింది. దీంతో రాష్ట్ర ఎరుకల సంఘం కుతాడి శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించడంపై శనివారం జవహర్‌నగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరుకల సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతుంటే కొంత మంది అగ్రవర్ణాలు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. మేడ్చల్ డీసీపీ సందీప్ కావాలనే కుట్ర పూరితంగా అక్రమ కేసులు బనాయించి పీడీ కేసు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కుతాడి శ్రీనివాస్ ఏ తప్పు చేయలేదని, ఈ విషయంపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయాంలో గిరిజనులపై దాడులు పెరిగిపోయాయని, ఎవరెన్ని కుట్రలు పన్నినా న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుతాడి శ్రీకాంత్, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్గొండ శ్రీనివాస్, కార్యదర్శి పురమ్ రఘు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, శేఖర్, రవి, యూత్ అధ్యక్షుడు గోపి, టీడీపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుతాడి రవి, నాయకులు మంజులగౌడ్, కేతమ్మ, రమేష్, శ్రీకాంత్, స్వామి, కుమార్ పాల్గొన్నారు.